ఇంకో చేతితో దేవుడిని పట్టుకోండి. పనిని మీ అంతట మీరు విడిచిపెట్టవద్దు, పనిని విడిచిపెట్టే ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు, అంతేగాని కోపం వచ్చి పనిమాని వేయకూడదు. చదువు పూర్తి అయిన తరువాత శిష్యులు వెళ్ళేటప్పుడు గురువుగారు ఏమి చెపుతున్నారు అంటే, లోకం ప్రమాదం మీరు జాగ్రత్తగా ఉండండి. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో లోకం అలా చూడదు జాగ్రత్తగా ఉండండి. అసహనం పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు, అగౌరవం పనికిరాదు, అవినయం పనికిరాదు అని చెప్పాడు. మీ చేతికి ఉన్న వాచ్ ఎవడైనా పట్టుకొని పోయాడు అనుకోండి, వాడిది ఎంత తప్పో మీది కూడా అంతే తప్పు, మీ అజాగ్రత్తవలన పట్టుకొని పోయాడు అందువలన అజాగ్రత్త పనికిరాదు. సృష్టిలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని నీకు ఇష్టం ఉండవచ్చు, కొన్ని నీకు ఇష్టం లేని సంఘటనలు జరుగుతాయి, అలాగని మీ సహనం పోగొట్టుకోవద్దు, అసహనం పనికిరాదు. చదువుతో పాటు ఇవి అన్నీ చెప్పి పంపాడు, వాడు గురువు. సోక్రటీసును విషం పెట్టి చంపారు. ముందురోజు జైలునుండి పారిపోదామని ఆయనతో ఉన్నవారు సోక్రటీసుతో చెపుతారు, ఆయన ఏమి చెప్పాడు అంటే “యు టు లివ్, ఐ టు డై” అన్నాడు అంటే మీరందరూ బతికి ఉండండి, నేను చనిపోతాను, అది ఈశ్వర నిర్ణయం. సోక్రటీసును చూడటానికి చాలామంది వచ్చేవారు. మిమ్మల్ని చూడటానికి ఇంతమంది వస్తున్నారు, మమ్మల్ని చూడటానికి ఎవరూ రావటం లేదు అని సోక్రటీసును అడిగితే నాకు ఏమీ తెలియదు అన్న సంగతి నాకు తెలుసు అందుకే అందరూ చూడటానికి వస్తున్నారు అన్నాడు. మాకు అన్నీ తెలుసును అని మీరు అనుకొంటున్నారు ఇంకెవరు చూడటానికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-09-05, యానాం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీకు అందరికీ జ్ఞానం కలుగుతుంది, సుఖం తెలుస్తుంది. సబ్జక్టు మాత్రం బాగా అర్థం చేసుకోండి. ఎప్పుడైనా మిమ్మల్ని సొంతబుద్ధి సుఖపెడుతుంది కానీ పరాయిబుద్ధి మిమ్మల్ని సుఖపెట్టదు. మీరు వివేకం పెంచుకోవాలి, పరిస్థితులను అర్థం చేసుకోవాలి. మనం ఎంతో కొంత వివేకంతోటి, పుణ్యబలంతోటి ఈ ప్రపంచంలోనికి వచ్చాము. మనం పూర్వజన్మలలో పుణ్యకర్మలు చేయటం వలన ఆధనం పెట్టి మనం ఈశరీరాన్ని కొనుక్కొన్నాము. మనకు ఈ మానవదేహం రావటం, ఆత్మజ్ఞానం సముపార్జించాలనే కాంక్ష రావటం, బుద్ధిసూక్ష్మత రావటం ఇవన్నీ పూర్వజన్మలలో మనం చేసినటువంటి సత్కర్మల ఫలితం, వాటితో ఇది కొనుక్కొంటే వచ్చింది కాని వూరికే రాలేదు. మనలోపల అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు, ఆయనను కాదని మనం చేసేది ఏమీలేదు. మనకు స్థూలశరీరం, సూక్ష్మశరీరం ఉన్నాయి. స్థూలశరీరం స్మశానంలో కాలిపోతుంది, సూక్ష్మశరీరం మనకూడా వస్తుంది. స్థూలశరీరం మరణించేలోపు సూక్ష్మశరీరాన్ని ఎంతవరకు బాగుచేసుకోగలిగితే అంతవరకు

బాగుచేసుకొని బయటకు వెళ్ళాలి. సూక్ష్మశరీరాన్ని పవిత్రం చేసుకోవటానికే ఈ సత్సంగాలు, ఈ ప్రవచనాలు. మన అహంకారం చెప్పినట్లు మనం నడుచుకుంటాము కాని శాస్త్రం చెప్పినట్లుగా మనం నడుచుకోము. ఈపని చెయ్యి అని భగవంతుడు చెపితే ఆ పని మనం చేయాలి, ఈ పని వద్దు అంటే అది మానివేయాలి. భగవద్గీతలో భగవంతుడు చెప్పినట్లుగా మనం నడుచుకొంటే మనకు పవిత్రత, ఏకాగ్రత, వినయం వస్తుంది. సూక్ష్మ శరీరం బాగుపడుతుంది, మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎక్కడయితే వినయం ఉందో వాడు గుణవంతుడు అవుతాడు, వాడు భగవంతుని యొక్క దయకు పాత్రుడవుతాడు. మనం సూక్ష్మశరీరానికి ట్రైనింగ్ ఇవ్వాలి, దానికే సత్పురుషుల సహవాసం. మనకూడా సంపదలు రాకపోయినా సూక్ష్మశరీరం మనకూడా వస్తుంది. ఈ సూక్ష్మశరీరాన్ని బాగుచేసు కోవటానికి ఎంతవరకు ప్రాముఖ్యత ఇవ్వాలో అంతవరకు మనం ప్రాముఖ్యత ఇవ్వటం లేదు, పైగా ఎంతోధనం పెట్టి కొనుక్కొన్న శరీరం ఇది, దీనిని వృధాచేసుకొంటున్నాము. మన శరీరాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకొని ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి. సహృదయం లేనివాడికి, వివేకం లేనివాడికి, వైరాగ్యం లేనివాడికి, సద్బుద్ధి లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం ఉన్నవాడు అందరికీ ఆనందాన్ని పంచిపెడతాడు, శాంతిని పంచిపెడతాడు. ఎవరైతే భగవంతుడిని స్మరించుకొంటున్నారో వారందరికి భగవంతుడు ఆనందాన్ని పంచిపెడతాడు.

దేహప్రారబ్దాన్ని బట్టి మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతాయి. ఇప్పుడు మనం పాలకొల్లులో బయలుదేరి యానాం వచ్చాము. దారిలో అనేకం ఎదురువస్తాయి, ఎవరితోనైనా మాట్లాడతాము, ఒక గంట ఆగుతాము కాని మన దృష్టి మాత్రం యానాం మీదే ఉంటుంది అలాగే మనం తపస్సు చేసినా, సజ్జనసాంగత్యం చేసినా, పెద్దలకు సేవ చేసినా, మనకు మంచిసంఘటనలు ఎదురైనా, చెడుసంఘటనలు ఎదరైనా, మనకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతున్నా మనం ఈ భూమి మీదకు వచ్చినది మొదలు మన లక్ష్యం మోక్షం మీదే ఉండాలి. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మన దేహప్రారబ్దాన్ని బట్టి బంధువులు, స్నేహితులు, విరోధులు వస్తారు, వీరందరూ స్వప్న సమానమే. మనకు అనేక తలంపులు, ఆలోచనలు వస్తాయి, వాటిని పట్టించుకోకూడదు. మన గమ్యం మోక్షం. మోక్షం పొందటానికి తగిన తలంపులు, ఆలోచనలు వస్తే వాటిని ఉపయోగించుకోవాలి, మోక్షం పొందటానికి అనుకూలంలేని తలంపులు, సంకల్పాలు వస్తే వాటిని తీసి ఒక ప్రక్కనపెట్టాలి, వాటితో పేచీలు పెట్టుకోవద్దు, వాటితో తాదాత్మ్యం పొందవద్దు. దేహప్రారబ్దం చెడ్డగా ఉన్నా దానితో కనుక తాదాత్మ్యం లేకపోతే ప్రారబ్దం కూడా ఏమీ చేయలేదు, మీకు దుఃఖం కూడా రాదు, జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. భగవంతుడు మనలోపల ఉన్నాడు, బయట ఉన్నాడు, అంతటా వ్యాపించి ఉన్నాడు. మన స్థూలబుద్ధి వలన మనం ఆయనను దర్శించలేక

పోతున్నాము, అంతటా ఉన్న ఈశ్వరుడిని జ్ఞాని దర్శిస్తూ ఉంటాడు. మీ దేహప్రారబ్ధం అనుకూలంగా ఉంది అనుకోండి, మీరు పొంగిపోవద్దు, సమానబుద్ధిని కాపాడుకోండి, అలా ఉంటే భగవంతుని దయకు మీరు పాత్రులవుతారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా గర్వం తెచ్చుకోవద్దు. ఈ అనుకూలపరిస్థితులు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి కాని గర్వం మీ సూక్ష్మశరీరాన్ని పట్టుకొని మీకూడా వచ్చేస్తుంది. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా చేయాలి. భగవంతుడికి ఒక ఆకారం లేదు, పేరు లేదు కాని మనలను గైడ్ చేయటానికి, మనకు బోధించటానికి ఒకరూపం ధరించి, ఒక పేరుపెట్టుకొని వస్తాడు. ఫలానా దేహం నాది, ఫలానా పేరు నాది అని అనుకోవటం మానివేస్తే ఈ శరీరం భూమిమీద ఉండగానే ఇప్పడే ఇక్కడే హద్దులులేని సుఖాన్ని, శాంతిని అనుభవించవచ్చు.

ఉన్నవాడు భగవంతుడు ఒక్కడే. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అంటాము. మనం ఏమీ సాధించలేదు. ఈ ఉపాధి మనం అనుకోవటం వలన నేను సాధించాను అనుకొంటాము. తనువు తాను కాదని తెలిసినవాడు ఏది చేసినా భగవంతుడు తన ద్వారా చేసుకొంటున్నాడు అనుకొంటాడు కాని నేను సాధించాను అని అనుకోడు. మనం పనిచేసేటప్పడు ఆ పనిచేయటం వలన మనం భగవంతుని దయకు ఎంతవరకు పాత్రులవుతామో చూసుకోవాలి, మన అంతర్యామి మనలను అనుగ్రహించకపోతే మనం ఎంతసాధన చేసినా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం ఇతరులతో పోల్చుకోకూడదు, మన పద్ధతిలో మనం జీవించాలి. మనం ఇతరులకంటే ఎక్కువ అని, తక్కువ అని అటువంటి భావనలలోనికి వెళ్ళవద్దు. భగవంతుడు మనకు ధనం, విద్య, అధికారం ఇలా కొన్ని అవకాశాలు ఇవ్వవచ్చు, ఇవన్నీ మనవికాదు, భగవంతుడు ఇచ్చినవే అని వాటిని ఎంతోకొంత సమాజానికి ఉపయోగిస్తూ ఉంటే దానివలన మనం ఈశ్వరునిదయకు పాత్రులవుతాము. అందుచేత ఈ ప్రపంచాన్ని ట్రైనింగ్ గ్రౌండ్‌గా తీసుకొని మంచి పనితోటి భగవంతుడిని ఆరాధించి ఈ శరీరం మరణించకముందే సూక్ష్మశరీరాన్ని బాగుచేసుకొని మనం బయటకు వెళ్ళాలి, ఎవరైనా నిన్ను విరోధిగా అనుకోవచ్చుకాని నీకు విరోధం వద్దు. మన ఇష్టాలు, అయిష్టాలు సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి, మనకు చేతనైతే మంచి చేయాలి లేకపోతే ఊరక ఉండాలి. మనం మాట్లాడేమాట మనకు అశాంతిని, దుఃఖాన్ని తీసుకొని రాకూడదు, ఇది గుర్తు పెట్టుకోండి. భాషను కూడా గౌరవించాలి. మనం సహృదయంతో మాట్లాడాలి, మాట్లాడే భాష శుద్ధిగా ఉండాలి. మన శరీరాన్ని నియమించుకోవాలి, మాటను నియమించుకోవాలి, మనస్సును నియమించుకోవాలి, అదే తపస్సు. ఎవడైతే తన మనస్సును నియమించుకొంటున్నాడో వాడికి లోచూపు కలుగుతుంది. మనస్సు బాహ్యాముఖానికి వెళితే అశాంతి, మనస్సు లోపలకు వెళితే విశ్రాంతి. భగవంతుడు చెప్పినమాట మనకు ప్రమాణం కాని లోకుల మాటలను

మనం ప్రమాణంగా తీసుకోకూడదు. నీకు శాంతి కావాలంటే, జ్ఞానం కావాలంటే ఈ లోకాన్ని తీసి ఒక ప్రక్కన పెట్టు.

మనం చనిపోయిన తరువాత ఈ సృష్టి ఆగిపోతుంది అని అనుకోవద్దు. ఈ సృష్టి కార్యక్రమం అలా జరిగిపోతూ ఉంటుంది, అది భగవంతుడు చూసుకొంటాడు. మనం ఏపనిమీద ఇక్కడకు వచ్చామో ఆపని పూర్తి చేసుకోవాలి అంటే ఈ ప్రకృతి గుణాలనుండి, వికారాలనుండి బయటకు రావాలి. మనం ఈ లోకంలోనికి అజ్ఞానంతో వచ్చినా మంచి పుస్తకాలు చదువుకొంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ, పుణ్యక్షేత్రాలు దర్శించుకొంటూ, జపధ్యానాలు చేసుకొంటూ ఎంతోకొంత జ్ఞానాన్ని పెంచుకొని, సూక్ష్మశరీరాన్ని శుద్ధిచేసుకొని బయటకుపోవాలి, అది మన లక్ష్యం. భగవంతుడు అలా కాదు పరిపూర్ణమైన జ్ఞానంతో, పరిపూర్ణమైన శక్తితో ఈ భూమి మీదకు వస్తాడు, పరిపూర్ణమైన జ్ఞానంతో, శక్తితో బయటకు వెళ్ళిపోతాడు. అందుచేత ఆయనతో మనం పోల్చుకోకూడదు. మనం మంచి స్నేహాలు చేయాలి. ఆంజనేయస్వామితో స్నేహం చేసినవారు అందరూ బాగుపడ్డారు. సత్పురుషులతో స్నేహం వలన లౌకికంగాను, ఆధ్యాత్మికం గాను కూడా బాగుపడతాము. మీరు కాలక్షేపం మాటలకు వెళ్ళవద్దు, అలా వెడితే బ్రెయిన్‌లో కాలుష్యం వచ్చేస్తుంది. అక్కరలేని పనులలోనికి వెళితే అజ్ఞానం చుట్టుకొంటుంది. నీకు భగవంతుడు ఏ పని అయితే ఇచ్చాడో ఆపనిలో బద్ధకంగా ఉండవద్దు. బద్దకస్తులకు లోకానికి సంబంధించిన పనులు పూర్తి అవ్వవు, ఆత్మజ్ఞానం రాదు. మీరు ఏ పనిచేసినా దానివలన నా దయకు పాత్రులయ్యేలాగ చేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. మన చర్మానికి దురదవస్తే పదిమంది డాక్టర్ల దగ్గరకు వెళతాము కాని మనస్సులో చెడుగుణాలు ఉంటే వాటిని తొలగించుకోవటానికి ఎక్కడికీ వెళ్ళటం లేదు. ఈ సబ్జక్టు కనుక మీరు శ్రద్ధగా వింటూ ఉంటే, దానిని అర్థం చేసుకొంటే మీకు రాత్రి బాగా నిద్రపడుతుంది, మీరు బ్రతికున్నంత కాలం సుఖంగా బ్రతకగలరు, వివేకంగా ఉండగలరు, శరీరం మరణించాక మోక్షం పొందుతారు. మనం మాటల విషయంలో, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒక మహాత్ముడు ఏమి చెప్పాడు అంటే అవసరంలేని మాటలు మాట్లాడటం నోటికి వ్యభిచారం, హోటళ్ళకు వెళ్ళి కనిపించిన గడ్డిఅల్లా తినటం పొట్టకు వ్యభిచారం అని చెప్పాడు. మనం ఆధ్యాత్మికంగా, భౌతికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, చాలా రోగాలకు మన పొట్టే కేంద్రం. మనకు అక్కరలేని తలంపులతోటి, ఆలోచనల తోటి తాదాత్మ్యం చెందకూడదు. మన పని మనం జాగ్రత్తగా చేసుకొంటూ వెళ్ళిపోవాలి. ఇప్పుడు మనం చెప్పకొనే మాటలు ఇహానికి, పరానికి కూడా ఉపయోగపడతాయి.

నీవుకాని వస్తువులతోటి, మనుషులతోటి, సంఘటనలతోటి ఎలాగయితే తాదాత్మ్యం

పొందుతున్నావో అలాగ నీవు ఏదిగా ఉన్నావో దానితో నీవు తాదాత్మ్యం పొందినప్పడే నీకు సుఖం అంటే ఏమిటో తెలుస్తుంది, అది నిజమైన సుఖం, దానితో తాదాత్మ్యం పొందితేకాని పునర్జన్మలు ఆగవు. నువ్వుకాని శరీరంతోటి, నువ్వుకాని మనస్సుతోటి తాదాత్మ్యం పొందుతున్నంతకాలం సాధన పేరుచెప్పి అందులోనుండి విడుదలపొందాలి. నువ్వు పుణ్యం చేస్తే మంచిలోకాలకు, పాపంచేస్తే చెడ్డలోకాలకు వెళతావు, ఎక్కడకు వెళ్లినా తిరిగి సంసార చక్రంలో పడతావు. నూటికి నూరుపాళ్లు ఏ వస్తువులో అయితే సుఖం ఉందో దానితో నీవు తాదాత్మ్యం పొందేవరకూ జన్మలు ఆగవు. హృదయంలో ఉన్న సుఖం నీకు అందినప్పడు, శాంతిసముద్రంలో నీవు ఊగిసలాడుతున్నప్పడు దేహప్రారబ్ధం అనుకూలంగా ఉంటే ఏమిటి? ప్రతికూలంగా ఉంటే ఏమిటి? కొంతమంది మేము ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాము అంటారు. చైతన్య ప్రవంతిలో నీవు ఊగిసలాడుతున్నప్పడు నేను ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాను అనే స్ఫురణ కూడా నీకు రాదు. ఇప్పడు మేము చెప్పే ఈ మాటల వలన మీరు దుఃఖస్పర్శలేనిస్థితికి ఎదిగిరావాలి. లేకపోతే ఈ మాటలు ఎందుకు? మీ అశాంతి అంతా శాంతిగా మారిపోవాలి, మీ దుఃఖం అంతా సుఖంగా మారిపోవాలి అందుకే ఈ ప్రవచనాలు, కాలక్షేపానికి కాదు. మీకు చదువు ఉన్నా లేకపోయినా, ఐశ్వర్యం ఉన్నా లేకపోయినా ఈ సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే మీ జీవితం సుఖంగా వెళ్లిపోతుంది, మీ శరీరానికి మరణం వచ్చినా మీరు శాంతిగా, సుఖంగా శరీరంలో నుండి విడుదల పొందుతారు. కొంతమంది మనకు విరోధంగా ఉంటారు. నీ విరోధులు నిన్ను బాధలకు, కష్టాలకు గురిచేస్తారు అనుకో, నీ విరోధులు ఇన్ని రకాలుగా నిన్ను చెడగొడుతున్నప్పటికీ ఆ బాధలు, కష్టాలు, నష్టాలు నువ్వు సహించగలిగితే, భరించగలిగితే, నీవు ఓర్పుగా ఉండగలిగితే అట్టి సాధకుడు నా దయకు పాత్రుడవుతాడు అని భగవంతుడు చెపుతున్నాడు.

ప్రతీజ్ఞాని దయ కలిగి ఉంటాడు. అజ్ఞాని ఏమి చేస్తాడు అంటే తన అజ్ఞానాన్ని తీసుకొనివెళ్లి జ్ఞానికి ఆరోపిస్తాడు. జ్ఞాని యొక్క దయ, ప్రేమ జ్ఞాని కానివాడికి ఎంత ప్రయత్నం చేసినా అది రాదు, జ్ఞానం వచ్చినప్పడే ఆవైభవం ఉంటుంది. జ్ఞాని ఆనందసముద్రంలో ఈదులాడుతూ ఉంటాడు. వాడు పంచిపెట్టాలని దయను పంచిపెట్టడు, అది పొంగిపొరలి ప్రవహిస్తూ ఉంటుంది. మనం పాడైపోవటానికి కారణం ఏమిటి అంటే మనం భగవంతుడు చెప్పిన మాటలు వినము, గురువు చెప్పిన మాటలు వినము. మన అజ్ఞానం చెప్పినట్లు వింటాము, ఇలా ఉంటే మనం పాడుజన్మలలోనికి, చీకటిలోకాలలోనికి వెళతాము. నీకు భగవంతుడు మీద విశ్వాసం ఉన్నా లేకపోయినా, ఈ శరీరం మరణించాక మీ సూక్ష్మశరీరం మీ కూడా వస్తుంది, ఇది గుర్తు పెట్టుకోండి. ఆ సూక్ష్మశరీరాన్ని బాగుచేసుకొనే ప్రయత్నం మనం చెయ్యటం లేదు, ఆ తపన మనకు లేదు. పూర్వజన్మలో ఎంతో కష్టపడి పుణ్యకర్మలు

చేసి ఈ దేహం సంపాదించుకొన్నారు. మీరు లక్షలు సంపాదించి ఆ రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి నీళ్ళు కాచుకుంటే ఎలాగఉంటుందో అలాగే పుణ్యకర్మలు చేసి సంపాదించు కున్న ఈదేహాన్ని అవసరంలేని పనులకు, అవసరంలేని విషయాలకు ఉపయోగించుకోవటం అలాగే ఉంటుంది. మీరు నీళ్ళు కాచుకోవటానికి డబ్బు సంపాదించుకుంటున్నారా? మీరు కాలాన్ని దుర్వినియోగం చేసుకోవటానికి పూర్వజన్మలో సత్కర్మలు చేసి ఈ శరీరాన్ని సంపాదించుకొన్నారా? జాగ్రత్తగా ఆలోచించుకోండి. మీరు మంచి చెప్పినా ఇతరులు వినరు అనుకోండి? వారి పని వారిని చేసుకోనివ్వండి. మీ పని మీరు మానవద్దు అంటున్నాడు పరమాత్మ. వారి పని వారు మాననప్పుడు మీ పని మీరు మానటం ఎందుకు? జ్ఞాని మంచివారి పట్ల ఆప్యాయంగా ఉంటాడు. జ్ఞాని ఎవరికీ సహాయం చేయాలని చేయడు, జ్ఞానిద్వారా సహాయ సహకారములు అందుతూ ఉంటాయి. జ్ఞానికి సంకల్పాలు ఏమీవుండవు.

మీరు గతం అంతా మర్చిపోండి, జరగబోయే గొడవలు ఏమీ ఊహించుకోవద్దు, వర్తమానకాలాన్ని సవినయంగా ఉపయోగించుకోండి. మీ శక్తిని దుర్వినియోగం చేసుకోవద్దు, మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనం పొయ్యి వెలిగించాము అనుకోండి, పొగ ఎక్కువగా ఉంటే గోడలు మసి అవ్వవచ్చు, పరిసరాలు అన్నీ మసి అవ్వవచ్చు అంతేగాని ఈ భూమి మీద ఉన్న పొగ వలన ఆకాశం మసి అవ్వదు. నీ దేహం మంచి పనులు చేయకపోయినా, నీ మనస్సుకు చెడు ఆలోచన వచ్చినా నీ హృదయంలో ఉన్న సత్యం అప్పుడు ఎలాగ ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. నీ దేహంతో చేసే పనులవలన, నీ మనస్సుకు వచ్చే ఆలోచనల వలన, నీలో ఉన్న అజ్ఞానం వలన నీలోపల ఉన్న అంతర్యామి, నీలోపల ఉన్న పరమాత్మ మసికాడువయ్యా. ఎందుకు గతాన్ని తవ్వుకొంటావు, భవిష్యత్ గురించి గాలిమేడలు కడతావు. నువ్వు మంచివాడవు అనుకొన్నా, చెడ్డవాడవు అనుకొన్నా లోపల ఉన్న వస్తువు ఎలాగ ఉందో అలాగే ఉంది. ఏనుగుకు పెద్ద దేహం ఉంది, చీమకు చిన్న దేహం ఉంది. కాని ఈ రెండింటిలో అంతర్యామి సమానంగానే ఉన్నాడు. అక్కడ పెద్దదిగా లేడు, ఇక్కడ చిన్నదిగా లేడు. మనో దేహములతో సంబంధం లేకుండా, లోకంతో సంబంధం లేకుండా, బుద్ధి యొక్క, ఇంద్రియాల యొక్క కాలుష్యంతో సంబంధం లేకుండా లోపల నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు. నువ్వు వాడి దయను సంపాదించు. ఈ సృష్టికి ఆధారంగా ఉన్నది ఆయనే. ఆధారంగా ఉన్నది నిజమే, ఆధారం మీద కల్పించినది అబద్ధం. మీ నామ రూపములతో తాదాత్మ్యం మీకు లేకపోతే, దేహము నేను అనే తలంపుతో తాదాత్మ్యం వదులుకొంటే ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు. ఇప్పుడే ఇక్కడే నీ హృదయంలో ఉన్న సుఖసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతుంది, అంతర్యామికి సంబంధించిన ఆనందం మీ చేతికి అందుతోంది అనుకోండి అప్పుడు మీ దేహానికి చావు వచ్చినా మీకు

ఏమీ అనిపించదు, ఆ స్థితికి మీరు ఎదిగి రావాలి, అందుకే ఈ ప్రవచనాలు. శిష్టా సుబ్బారావుగారు భగవాన్‌తో చూపు తగ్గిపోతోంది అని అంటే మీరు బయట చూపుకు ప్రాముఖ్యత ఇవ్వవద్దు, లోపలచూపు నేర్చుకోండి, లోపలచూపు అలవాటు పడితే, లోపల ఉన్న వస్తువు మీకు దొరికితే బయట చూపు లేదు అనే తలంపు కూడా పోతుంది అన్నారు భగవాన్, అది జ్ఞానం యొక్క వైభవం. సత్పురుషులను, మహర్షులను, మహాత్ములను ఆరాధించటం వలన భౌతిక సంపదలే కాదు, మోక్షం కూడా వస్తుంది. జ్ఞానికి పెట్టే నమస్కారం నాకే వర్తిస్తుంది అని పరమాత్మ చెప్పాడు. దేహబుద్ధి లేనివాడికి నీవు ఏ గౌరవం చేసినా అది వెళ్ళి ఈశ్వరుని మెడలో హారంలా పడుతుంది. జ్ఞాని అన్ని పరిస్థితులలో అన్ని అవస్థలలో ఒకేలాగ ఉంటాడు. మీరు ఏదైనా మంచి చేసినా, చెడు చేసినా ఒక కాలంలో చేస్తారు, ఇంకో కాలంలో అనుభవిస్తారు, అది పోతుంది. ఆత్మజ్ఞానం కర్మఫలితం వలన రాదు అని పరమాత్మ చెపుతున్నాడు. పదిమందికి ఉపకారం చేసావు అనుకో మంచిదే పుణ్యం వస్తుంది, ఆత్మజ్ఞానం రాదు. ఆత్మను ధ్యానంచేసి, ఆత్మను స్మరించి, నువ్వు ఆత్మకోసం జీవిస్తూ ఉంటే, దాని కోసమే నీ కాలాన్ని అంతా వెచ్చిస్తూ ఉంటే, అప్పుడు ఆత్మ కూడా వీడు నా కోసమే బతుకుతున్నాడు అనుకొంటే, అప్పుడు ఆత్మ యొక్క దయ వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

కొంతమందికి అధికారం వస్తే అతిగా ప్రవర్తిస్తారు, కోతికి కొబ్బరికాయ దొరికినట్లుగా ఉంటుంది, సాధ్యమైనంత వరకు తక్కువ కలుగజేసుకొనేవాడే మంచి పరిపాలకుడు. అవసరం లేనిదానికి కూడా కొంతమంది కలబడిపోతారు. జ్ఞాని ఏది చేసినా ఇతరులకోసమే చేస్తాడు. ఒకవేళ జ్ఞాని ఆగ్రహించినా, అది కూడా ఇతరులకోసమే, అది గుర్తించిన వాడు ధన్యుడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారితో మాట్లాడితే నాకు ఏమి కలిసివస్తుంది, నీకు ఆ పని చేస్తే నాకు ఏమి కలిసివస్తుంది అని ఆలోచిస్తూ ఉంటారు, ఇలా అహంకారం కేంద్రంగా పెట్టుకొని పనిచేసేవారు, వారికి బాహ్యంగా వేయి కోట్ల డబ్బు ఉన్నా వారు కూలివారితో సమానము అని పరమాత్మ చెప్పాడు. మన సొంతపని ఎలాగ చేసుకొంటామో ఇతరుల పని అలాగ చేయము, చిత్తశుద్ధి లేని పనులు చేస్తున్నాము. మన సొంత ఇల్లు ఎలాగ కట్టుకొంటామో అలాగ కాటన్ దొర ఆనకట్ట కట్టాడు, అందుకే ఇప్పటికీ ఆయనను స్మరించుకొంటున్నాము. మేము చెప్పే ఈ మాటలు మీకు ఉన్న వివేకాన్ని పెంచటానికి ఉపయోగపడాలి లేకపోతే ఈ మాటలు ఎందుకు? కొంతమంది అన్నీ మాకే తెలుసు అంటారు, అన్నీ మీకే తెలిస్తే ఇంక మీకు భగవంతుడు ఎందుకు? చనిపోయేవాడికి కూడా అదే చివరిశ్వాస అని వాడికి తెలియదు, ఇంకా ఉంటాను అనుకొంటాడు. ఆ చివరిశ్వాసే మీకు తెలియదు కాని అన్నీ తెలుసును అంటారు. జ్ఞాని అందరినీ చూస్తూ ఉంటాడు, అన్ని వికారాలను, అన్ని గుణాలను చూస్తూ తాను ఆ వికారములకు లోనుకాకుండా, సమత్వాన్ని

విడిచిపెట్టకుండా తనలోపల ఉన్న వస్తువునే అక్కడ చూస్తూఉంటాడు, వాడు జ్ఞాని, వాడు గురువు. జ్ఞాని నిన్ను చూసినప్పడు కూడా తనని తానే చూసుకొంటాడు. నీలో చాలా వికారాలు ఉండవచ్చు, ఆ వికారాలను చూడడు, ఆ వికారములలో నుండి నిన్ను విడుదల చేయటానికి చూస్తాడు, నీకు సహాయ సహకారములు అందిస్తాడు, వాడు గురువు. ఇది అంతా కూడా సైలెంట్‌గా చేస్తాడు. పారమార్థిక సత్యంతో ఏకమైన వాడే జ్ఞాని. మీలో ఉన్న బలహీనతలు శాశ్వతంకాదు, అవి నిజం కాదు కాబట్టి సాధన చేస్తే అవి పోతాయి, ఈశ్వరుని దయను సంపాదిస్తే ఇవి అన్నీ పోతాయి. మీలో ఉన్న మంచితనం, వివేకం, బుద్ధిసూక్ష్మత పెంచుకొంటూ ఉంటే, భగవంతుని మీద ధ్యాసపెట్టుకొని పనిచేస్తూ ఉంటే మీకు పూర్వజన్మలలో ఎంత చెడు ఉన్నా అంటే మీకు చెడుప్రారబ్ధం ఉన్నా దానికి ఎంత శక్తి ఉందో అంతశక్తి చూపించకుండా బయటకు పోతుంది, అంటే తలకాయ పోయేది కిరీటం పోయి ఆగిపోతుంది, అది మంచితనం యొక్క వైభవం.

గంటల తరబడి గది తలుపులు వేసుకొని ధ్యానం చేసేవాడికి ఏ ఫలితం వస్తుందో సహృదయంతో సత్కర్మ చేసేవాడికి అదే ఫలితం వస్తుంది అంటున్నాడు పరమాత్మ. మీరు ఒక మంచి పనిచేసి దాని వలన వచ్చే ఫలితం సమాజానికి ఇవ్వండి, అందులో ఉన్న కష్టం ఏమిటో మీకు తెలుస్తుంది, కర్మఫలాన్ని త్యాగం చేయటం ఎంత కష్టమో అప్పడు మీకు తెలుస్తుంది. మీరు సబ్జక్టును అర్థం చేసుకోవటం మానివేసి ఆవేశపడుతున్నారు, ఉద్రేకం నేర్చుకొంటున్నారు. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పడు పొంగు రాకుండా, పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే కుంగు రాకుండా చూసుకొంటూ ఉంటే మీకు తెలియకుండానే నెమ్మదిగా అహంభావన నశిస్తుంది, ఎందుచేతనంటే అప్పడు అహంభావనకు వెళ్ళే ఆహారం తగ్గిపోతుంది, దానికి వెళ్ళే మేత ఎప్పడైతే తగ్గిపోయిందో అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. ఇతరుల గొడవలలోనికి వెళ్ళటం తగ్గించుకోవాలి, వైరాగ్యాన్ని పెంచుకోవాలి, సత్వగుణాన్ని పెంచుకోవాలి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సమాజానికి ఉపయోగించాలి, అక్కడ మీరు ఏమీ ఆశించకూడదు. పని మిమ్మల్ని బంధించదు, ఆసక్తి మిమ్మల్ని బంధిస్తుంది. కర్మఫల త్యాగికి అంతఃకరణశుద్ధి కలుగుతుంది. ఈ లోకంతోటి, దేహంతోటి, కర్మసిద్ధాంతం తోటి దేనితోను సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మీరు ఆనందంగా ఉన్నారనుకోండి ఇంక పునర్జన్మ రాదు, అదే కడసారి జన్మ, మీరు అలా ఉన్నారో లేదో చూసుకోండి. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది దైవసంకల్పం. దైవసంకల్పానికి భిన్నంగా జ్ఞాని ఉండడు, అందుచేత అక్కడ ఘర్షణ లేదు. మనకు పరమాత్మ పాదాల పట్ల భక్తి కుదిరింది అనుకోండి మన శరీరానికి శ్రమ లేకుండా, సాధనతో పనిలేకుండా మనస్సు అణిగిపోతుంది. ఈశ్వరసంకల్పం పట్ల మనకు గౌరవం కుదిరితే, ఆసక్తి లేకుండా మనం పని చేస్తూఉంటే, భగవంతుడికి నీ

మీద దయ, ప్రేమ కలిగితే దూడ పుట్టిన వెంటనే ఆవు ఆ దూడమీద ఉన్న మాయను ఎలా నాకుతుందో అలాగ నీ అంతఃకరణంలో ఉన్న దోషాలను అన్నీ భగవంతుడు నాకి, నిన్ను పవిత్రుడిని చేసి, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. నీకు ఉన్న డబ్బుతో, పాండిత్యంతో భగవంతుడిని కొనలేవు. మనం ఏవైతే గొప్పవి అనుకొంటున్నామో అవి భగవంతుడి దృష్టిలో డస్టు. ఎవరికైతే భక్తి కలిగిందో, ఎవరికైతే జ్ఞానం కలిగిందో వారికి పరమాత్మ స్వాధీనమవుతాడు. భగవంతుడు అంతటా ఉన్నాడు కాని మన పాడుబుద్ధికి గోచరించటం లేదు కాబట్టి ఆయన లేడు అనుకొంటున్నాము. నువ్వు ఐశ్వర్యం సంపాదించుకో, పాండిత్యం సంపాదించుకో మంచిదే అలాగని బుద్ధిని పాడుచేసుకొని ఈ లోకంలో నుండి బయటకు వెళ్ళకు. కాలప్రవాహంలో నీవు సంపాదించిన డబ్బు, పాండిత్యం అన్నీ పోతాయి. నువ్వు నేర్చుకొన్నవి అన్నీ ఇక్కడ విడిచిపెట్టవలసిందే. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల గురించి మీ బుద్ధిని పాడుచేసుకొంటారా? మీ బుద్ధి పాడైపోయిన తరువాత మీ చదువు, డబ్బు, అధికారం ఏమి చేసుకొంటారు. జ్ఞాని శరీరం ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటుంది, మన శరీరం అహంకారం స్వాధీనంలో ఉంటుంది. జ్ఞాని శరీరం ద్వారా ఏది జరిగినా అకర్తగా ఉంటాడు. మనం దేహం అనుకోవటం వలన ఏ పని చేసినా మనమే సాధించాము అనుకొంటాము. దేహబుద్ధి వలన మనకు కర్తృత్వం వస్తోంది. మన డ్యూటీ మనం చేయాలి కాని కర్తృత్వం పెట్టుకోకూడదు, ఆసక్తి పెట్టుకోకూడదు. అలా ఉంటే మనం శాంతిగా ఉంటాము, ఆ పని పూర్తి అయిపోతుంది, కర్తలేని కర్మ అంటే అది.

మీరు ఈశ్వరుడి పట్ల భక్తిని విడిచిపెట్టవద్దు. భక్తి లేకుండా వివేకం, విచక్షణ, జ్ఞానం రాదు. అది అలా జరిగి పోయింది, ఇది ఇలా జరిగిపోయింది అనుకొంటున్నారు, ఇంకా ఏవో జరుగుతాయి అని ఊహించుకొంటున్నారు జరిగిపోయినది ఏమీ లేదు, ఇప్పుడు జరుగుతున్నది లేదు, భవిష్యత్తులో ఏమీ జరిగేది లేదు. ఇవన్నీ ఊహించుకొని మీ బుద్ధిని పాడుచేసుకొంటున్నారు, ఇది అంతా స్వప్నమే. నథింగ్ ఎవ్వర్ హేపెన్. మీరు మీరుగా ఉండటం నేర్చుకోండి. ఎవరు పేదవారు అని ఈమధ్య ఒకరు నన్ను అడిగారు. నేను ఊరక ఉన్నాను. ఆయన ఏమి చెప్పారు అంటే ఎవరు శారీరకంగా ఎక్కువ కష్టపడుతున్నారో వారే పేదవారు అని మనం గుర్తించాలి అని చెప్పారు. డబ్బు అంటే మాయ, అది ఎలా వచ్చిందో అలాగే పోతుంది. మనలను ఇతరులు ఎవరైనా మోసగిస్తున్నారు అనుకోండి వారు తప్పు చేస్తున్నారు అనుకొంటాము కాని వాళ్ళది ఎంత తప్పో మనది కూడా అంతే తప్పు. ఎందుచేతనంటే ఇతరులు మోసం చేస్తూ ఉంటే మోసగింపబడకుండా ఉండే తెలివి మనకు లేదు, ఇక్కడ మన తప్పు మనకు తెలియటం లేదు, వారిని తిడుతున్నాము, ఇది గుర్తించాలి. మనకు సహనం లేదు, వివేకం లేదు, విచక్షణ లేదు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు

ఉన్నాయి. మన తెలివితేటల వలన వాటిని జయించలేము. భగవంతుడి యందు భక్తి కలిగి, ఆయనను స్మరిస్తూ, ఆయనను ధ్యానిస్తూ, ఆయన పాదాలను ఆశ్రయిస్తే వాటిలోనుండి బయటపడతాము. సుగుణాలను పెంచుకొంటూ గుణాతీతస్థితిని పొందు, కర్మను చేస్తూ చేస్తూ కర్మను దాటి వెళ్ళిపో అంటున్నాడు పరమాత్మ. మనం బల్లకట్టు మీద కూర్చొని ఉండిపోము. బల్లకట్టు ఉపయోగించుకొని ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు దాటి వెళతాము. అలాగే కర్మను సాధనంగా చేసుకొని చీకటిలో నుండి వెలుతురు లోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానం లోనికి రావటానికి ప్రయత్నం చెయ్యి.

గోపికలకు పాండిత్యం లేదు, శ్రీకృష్ణచైతన్య గొప్ప పండితుడు, సన్యాసి ఆయన చివరి రోజులలో ఒక మాట చెప్పారు. పాండిత్యం, ఆస్తులు లేని గోపికలకు కృష్ణుడి మీద ఉన్న భక్తి, ప్రేమ కూడా నాకు పరమాత్మ మీద రాలేదు అని చెప్పాడు. కృష్ణా అంటే చైతన్యుడికి సమాధి వచ్చేది అయినా గోపికల ప్రేమతోటి ఈ ప్రేమ సరిపోతుందా అన్నాడు. గాలి లేకుండా బ్రతకగలరు కాని పరమాత్మ మీద ప్రేమ లేకుండా బ్రతకలేనిస్థితి గోపికలది. గోపికల మనస్సులో ఉన్న ఏకాగ్రత, పవిత్రత, కృష్ణుడిని అతిగా ప్రేమిస్తున్నాము వారి కుటుంబసభ్యులు ఏమైనా అనుకొంటారేమో అనికూడా తెలియని ధ్యాస, వారి ప్రాణం కృష్ణా, వారి మనస్సు కృష్ణా, వారి లోకం కృష్ణా, వారికి అంతా కృష్ణుడే. గౌరవాలు, అగౌరవాలు లెక్కింపు లేనటువంటి ప్రేమ. ఒక్క గోపికకు ఉన్న ప్రేమ, భక్తి నాకుఉంటే చాలు నేను తరించిపోతాను, గోపికల యొక్క పాదధూళి మన శరీరం మీద పడినాచాలు మనం తరించిపోతాము అన్నాడు చైతన్యుడు. గోపికల ప్రేమ, భక్తి అలౌకికమైనది, అభౌతికమైనది. గోపికల ప్రేమ ఇట్టిది అని పోల్చటానికి ఇంకొకటి లేదు, అది సహజమైన ప్రేమ. అజ్ఞానంలోనుండి, దేహాభిమానంలోనుండి ఇసుమంతయు నొప్పిలేకుండా బయటకు రావాలంటే ఆగోపికలకు ఉన్న ప్రేమ నేర్చుకొంటే చాలా తేలికగా శరీరానికి శ్రమ లేకుండా బయటకు వచ్చేస్తాము, ఎంతో కష్టపడిపోతున్నాము అనే వేదన మనకు ఉండదు. మీరు సాధన చేసేటప్పుడు మీకు అవసరంలేని తలంపులు వస్తాయి, ఈ తలంపులు ఎవరికి వస్తున్నాయి అని ప్రశ్నించుకోండి? ఇవి అన్నీ మిధ్యానేనుకే వస్తున్నాయి అని తెలుసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే లోపల ఉన్న బురద అంతా బయటకు వస్తూ ఉంటుంది. మీ పూర్వజన్మలో తెలియక పొరపాట్లు చేసారు, ఇప్పుడు తెలిసి వాటిని పోగొట్టుకోండి. పూర్వజన్మలో వాసనలు ఊరికేరావు కూడా బురద తీసుకొని వస్తాయి, ఆ బురదతో తాదాత్మ్యం పొందకండి. ఏమిటి ఈ వాసనలు ఇలా వస్తున్నాయి, ఇన్ని వాసనలు ఉంటే మనకు మోక్షం వస్తుందా అని కంగారుపడకండి. ఆ వాసనలతో మీరు కలవవద్దు, ఆ బురద దానంతట అదే పోతుంది, మీరు కంగారుపడితే ఉన్న బురద పెరిగిపోతుంది. మీకు వచ్చే తలంపులను వేరుగా చూడండి ఆ బురద అంతా

కొట్టుకొనిపోతుంది అంటున్నారు భగవాన్. గోపికలు ఏమంటున్నారు అంటే మేము పరమాత్మ వంకే చూస్తూ ఉంటాము, అసలు ఆ బురద వంక చూడము అంటున్నారు. మేము పరమాత్మ గురించి మాట్లాడుకొంటాము, ఆయన లీలలు చెప్పకొంటాము, ఈ లోపు ఆ బురద ఎలా వచ్చిందో అలాగే పోతుంది. మనం నిద్రలో ఉండగా మన శరీరం మీద నుండి పాము పాకి వెళ్ళిపోయింది అనుకోండి, అసలు ఆ పాము పాకి వెళ్ళినట్లు మనకు తెలియదు. అలాగే మాకు పరమాత్మ ధ్యాస తప్ప ఇంకేమీ లేదు బురద వస్తే వస్తుంది కాని అది వచ్చివెళ్ళిన ధ్యాస, ఆ ధోరణి మాకు లేదు అంటున్నారు గోపికలు. ప్రారబ్దాన్ని బట్టి మీకు మంచిరోజులు రావచ్చు, చెడురోజులు రావచ్చు అందులో మీరు కలిసిపోవద్దు, అది వచ్చి వెళ్ళిపోతుంది. మీ సాధనలో మీరు ఉండండి, మీ గమ్యాన్ని మర్చిపోవద్దు, పరమాత్మ పాదాలను విడిచిపెట్టవద్దు. కొంతమంది చిన్న కష్టం వచ్చినా దానిని పెద్దది చేసేసుకొంటారు అది పనికిరాదు అని పరమాత్మ చెపుతున్నాడు.

మనకు మంచిప్రారబ్దం వచ్చినా అందులో కలిసిపోయి మీరు అజ్ఞానం పెంచుకొంటూ ఉంటే ఆ మంచిప్రారబ్దం కూడా భవిష్యత్‌లో బురద తీసుకొని వస్తుంది. చెడు ప్రారబ్దం వచ్చినా కలవకండి. అలా కలవకుండా ఉంటే మీకు బురద అంటుకోదు. సాధన అంటే ఏమీ లేదు ఈ బురద గొడవ వదిలించుకోవాలి. చెరువులో నీళ్ళు ఉన్నాయి అనుకోండి, ఆ నీటి అడుగునకు వెళ్ళి అస్తమాను అటూ ఇటూ కదుపుతున్నారు అనుకోండి, బురద అంతా పైకి వచ్చేస్తుంది, మీరు కెలకటం మానివేస్తారు అనుకోండి, బురద కిందకు వెళ్ళిపోతుంది. అలాగే మీకు ఏమైనా గొడవలు వచ్చాయి అనుకోండి, అస్తమాను వాటిని కెలుక్కోవద్దు, కెలుక్కోకుండా ఉంటే అవి పోతాయి, మీ అంతట మీరు అస్తమాను వాటిని కెలుక్కొంటూ ఉంటే చిన్న గొడవలు కూడా పెద్దవి అవుతాయి. కొంతమందికి అసలు భగవంతుడి స్మరణ ఉండదు, ఎంతసేపు వారు కొట్టారని, వీరు తిట్టారని ఇటువంటి మాటలు చెప్పకొంటూ కాలం గడిపేస్తారు, ఈ లోపు శరీరానికి మరణం వచ్చేస్తుంది. మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు మనం మోక్షం పొందాలి, మన గమ్యం అదే, ఇది జ్ఞాపకం పెట్టుకోండి. గోపకల భక్తి ఎటువంటిది అంటే వారు పాలు తాగేటప్పడు కూడా పరమాత్మ స్మరణే ఆ గోపికల పెదాలకు తగిలేది, అట్టిది వారి ప్రేమ, అట్టిది వారి భక్తి. ఇంక బురద ఎక్కడ ఉంది? బురద వస్తుంది, ఆ బురదతో మీరు తాదాత్మ్యం పొందకండి, అది ఎలా వచ్చిందో అలాగే పోతుంది అని విచారణమార్గంలో చెప్పవచ్చు కాని గోపికలు ఏమంటున్నారు అంటే తాదాత్మ్యం మాట అలా ఉంచండి పరమాత్మ స్మరణలో అది వచ్చి వెళ్ళిపోయిన జాడ కూడా మాకు తెలియటం లేదు, ఆ గుర్తింపు మాకు లేదు అంటున్నారు. అట్టిది గోపికల యొక్క ప్రేమ. ఇంట్లోనివారు ఏమనుకొంటారనే తలంపు కూడా గోపికలకు లేదు. మనం ఏదైనా కొంత లేటు అయితే ఏదో అబద్ధం చెప్పటానికి ముందునుండే ప్రిపేర్ అవుతాము కాని గోపికలకు అసలు ఆ ధ్యాసే లేదు. గోపికల ప్రేమ నేర్చుకొన్నదికాదు, అది

ఆపుకోలేని ప్రేమ. ఆ ప్రేమ ప్రవాహంలో, భక్తి ప్రవాహంలో ఒకవేళ బురద ఉన్నా ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతుంది, అప్పుడు కూడా మాకు కనిపించేది నీ పాదాలే అంటున్నారు గోపికలు, అట్టిది వారి ప్రేమ. మన పని మనం శ్రద్ధగా చేసుకోవాలి. మన పని మనం శ్రద్ధగా చేయము అనుకోండి, ఆ చేయలేనితనం మనకు తిరిగి దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. కంగారు పడవద్దు, అక్కడ అలా జరిగింది, ఇక్కడ ఇలా జరిగిపోయింది, ఏదో జరిగిపోతోంది అని అన్నీ నొల్లుకొని, ఏవో కల్పించుకొని మీరు దుఃఖంలో పడిపోతున్నారు. పూర్వజన్మలో ఏమీ జరగలేదు, ఇప్పుడు ఏమీ జరగటం లేదు, రాబోయే జన్మలో ఏదీ జరగదు. మీకు తెలియకపోవటం వలన, మీ అజ్ఞానం వలన మీకు అలా అనిపిస్తోంది. ఏదో జరిగిపోయింది అనుకోవటం వలన దుఃఖం వస్తోంది, ఏదైనా జరిగితే కదా దుఃఖం రావటానికి. నథింగ్ ఎవర్ హేపెన్, బి హేపీ.

జనన మరణములు లేనివాడు, బంధం లేనివాడు, శాంతి కలవాడు, స్వతంత్రుడు పరమాత్మ, మనం పరమాత్మ పాదాలను ఆశ్రయిస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం, అదే సుఖం. భగవంతుడు ఈ లోకంలోనికి వచ్చేటప్పుడు అతివైభవంగా వస్తాడు, వెళ్ళేటప్పుడు అతి వైభవంగా వెళ్ళిపోతాడు. మనం ఏడుస్తూ వస్తాము, అజ్ఞానంతో వస్తాము, కాని వెళ్ళేటప్పుడు అజ్ఞానం తొలగించుకొని ఆనందంతో, శాంతితో వెళ్ళిపోవాలి. వందమాటలు అక్కరలేదు, పరమాత్మ యొక్క ఒక్క చూపు చాలు, ఒక్కమాట చాలు, ఆయన మౌనం చాలు, మనలో ఉన్న అజ్ఞానం అంతా కాలి బూడిద అవుతుంది. మనం భగవంతుడిని స్మరించుకొంటాము కాని ఒక్కసారి భగవంతుడు మన గురించి అనుకొంటే చాలు మన పని పూర్తి అయిపోతుంది. జటాయువుకు రాముడు తన చేతులతో శవ సంస్కారం చేసాడు. పెద్ద పెద్ద తపస్సులు చేసినవారు, మహర్షులు ఎటువంటి పుణ్యలోకాలకు వెడుతున్నారో అక్కడకు వెళ్ళు జటాయువు అన్నాడు, వెళ్ళవలసిందే, అది రాముడి వాక్యం. మీరు కంగారుపడకండి అదృష్టం బురదే, దురదృష్టం బురదే, ఎందుచేత బురద అంటే అదృష్టం మీరుకాదు, దురదృష్టం మీరు కాదు, అదృష్టం వచ్చినప్పుడు రోజులు బాగా వెళ్ళిపోతాయి, దురదృష్టం వచ్చినప్పుడు రోజులు ఇబ్బందికరంగా వెళ్ళిపోతాయి. అదీ బురదే, ఇదీ బురదే, అలా వస్తుంది, వెళ్ళిపోతుంది, దానితో తాదాత్మ్యం పొందకండి. దానితో తాదాత్మ్యం పొందితే బురద పెరిగిపోతుంది. ఒక్కమాట మీరు గుర్తు పెట్టుకోండి మనం ఆనందంలో ఉన్నాము అనుకోండి ఈ దేహం చనిపోయినా, లోకం కనిపించకపోయినా మనకు ఏమీ అనిపించదు, అట్టి ఆనంద స్థితికి మనం ఎదిగిరావాలి, ఈ ప్రవచనాల లక్ష్యం అదే. మనం తరించటానికి పెద్ద పెద్ద సాధనలు అక్కరలేదు. పరమాత్మ పాదాలయందు భక్తి ఉంటే చాలు మనం తరిస్తాము. దేవుడు దేవుడిగా వస్తున్నాడు, దేవుడిగా వెళ్ళిపోతున్నాడు, ఆయన వైభవం అది. మనం జీవులుగా వచ్చాము కాని వెళ్ళేటప్పుడు దేవుడు అయ్యి వెళదాము, ఈరోజు ప్రవచనం యొక్క సందేశం అది.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | |
|---|---|
| 08-10-05 శని | చిలుకూరు, వయా మహదేవ పట్నం |
| 16-10-05 ఆది | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| 27-10-05 గురు | క్షత్రియ కళ్యాణ మండపం, పాలకొల్లు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# మోహం నశిస్తేనే మోక్ష బుద్ధి కలుగుతుంది

లోకంలో ప్రభలంగా ఉన్న రంగులు - రూపాలు మొదలుగాగల తమాషాల మూలంగా మనస్సు ఏకాగ్రతను కోల్పోతున్నది. మనస్సు ప్రకృతిలోకి వచ్చిందంటే అంతా కపటంతోనే చేస్తుంది. ప్రతి ఒక్కటీ కావాలని మానవుడు ఆశిస్తాడు వాటిని పొందటానికి పాపాలు చేస్తూ ఉంటాడు. సాధారణంగా సంపద మొదలైనవి అన్నీ పాపాలు లేకుండా సమకూరవు అలా సమకూరినవన్నీ చనిపోయేటప్పుడు వెంటరావు. అలెగ్జాండర్ ప్రపంచాన్ని జయించి వట్టి చేతులతోనే వెళు తున్నానని తెలిపాడు. మోహం వల్ల ఉద్భవించునది అంతా దుఃఖమే. మోహ భావన ఎంత ఎక్కువగా నశిస్తే అంత ఎక్కువగా మనలో మహత్తర శక్తి ప్రజ్వలిత మౌతుంది. కాబట్టి ఇంద్రియాలను, బుద్ధిని బహిర్ముఖం కాకుండా అంతర్ముఖం చెయ్యటం ఒక్కటే సరైన మార్గము "మోహమనే సముద్రాన్ని దాటకుండా రాగ-ద్వేషాలనే రాక్షసులను సహకరించకుండా సత్యంలో ఎలా నిలవగలవు" అన్నారు శంకరులు. వర్షాకాలంలో మేఘాల కదిలిక ఉధృతంగా ఉన్నంతకాలం - ఆకాశం నుంచి వర్ష బిందువులు పడుతూనే ఉంటాయి. అలాగే మనస్సులో మోహం ఉ ంటుందో అక్కడ సంకల్పాలు, ఆశలు, సుఖదుఃఖాలు చేరి ఉంటాయి. అరికాలు నుంచి శిరస్సు వరకూ శరీరంలో అణువణువునా పరిశీలించి చూచినా ఆమోదయోగ్యమైన ఏదీ లేదు. రాతి విగ్రహాలకు పరస్పరం ప్రేమలు ఉండవు. అలాగే జఢమైన దేహాదుల యందు ప్రేమ ఎందుకు కలుగుతోందో ఒక్క క్షణం ఆగి పరిశీలిస్తే మోహబుద్ధి కలుగుతుందా? సముద్రంలో కెరటాలు కలుస్తాయి, విడిపోతాయి. అంతా నీరే అలాగే సంతానం మనే మాయారూపాలమీద అంతరంగంలో అంతా చైతన్యమే అనే భావన స్థిరపడితే మోహం ఎక్కడ శ్రీనాన్నగారు అన్నారు. కుటుంబ రాగ బంధనాలలో చిక్కుకొని దుఃఖం కలిగితే నిప్పులు చల్లారినట్లు మోహం వల్ల జనించే దుఃఖం వెంటనే నశిస్తుంది" అన్నారు. జ్ఞాని దృష్టి తనకన్న భిన్నంగా దేన్ని చూడడు ఆ భావనలోనే మనం ఉంటే మనకు మోహం ఉదయించదు. శాశ్వత సుఖాన్ని పొందుతారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**



సద్గురు శ్రీ నాన్నగారుతో శ్రీరమణ క్షేత్ర కమిటీ సభ్యులు



సద్గురు శ్రీనాన్నగారి జన్మదినోత్సవ సందర్భంగా పూజ చేస్తున్న రిటైర్డ్ ఇఇ శ్రీ దాట్ల కృష్ణమూర్తిరాజు దంపతులు